ఎంపీ రాములుకు ఆహ్వాన పత్రిక అందజేత

ఎంపీ పోతుగంటి రాములుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ నగరంలో నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని.. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వేర్వేరుగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. వీరి వెంట ఉత్సవ కమిటీ చైర్మన్ తిరునగరి వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 14 : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలు, తండాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యం, నాయకులు జవహర్‌లాల్‌నాయక్, శ్రీనివాస్, రాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే లైసెన్స్ రద్దు

పట్టుబడ్డ వాహనాలను పరిశీలిస్తున్న అధికారి

షాబాద్, ఫిబ్రవరి 14: రేషన్ బియ్యం దందాలో పట్టుబడే వాహనాలను నడిపిన వారి లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ తెలిపారు. బుధవారం శంషాబాద్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల పట్టుబడ్డ పలు వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం కాగానే, వీధి వీధి తిరిగి బియ్యం కొనేవారికి తగిన శిక్షణ లేకపోవడంతోనే మళ్లీ మళ్లీ అదే పనిచేస్తున్నారని ఆక్షేపించారు. అందుకోసం రేషన్ బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడ్డ వాహనాల అనుమతిని కూడా రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు.

ఆలయాల్లో అక్షరాభ్యాసం

- ఘనంగా వసంతపంచమి
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

ఇబ్రహీంపట్నం : జ్ఞానసరస్వతి దేవాలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న చిన్నారులు, భక్తులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 : యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలోని జ్ఞానసరస్వతి దేవాలయంలో బుధవారం వసంతపంచమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున అక్షరాభ్యాసం చేపట్టారు. ముందుగా సరస్వతి అమ్మవారికి అభిషేకం, అలంకరణ అనంతరం పూజలు చేశారు. విద్యారణ్య భారతిస్వామిజీ ఆధ్వర్యంలో 350మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా నందివనపర్తి పదోతరగతి విద్యార్థులతో సరస్వతి హోమం నిర్వహించారు. విద్యార్థుల సంపూర్ణ వికాసాన్ని కాంక్షిస్తూ సంకల్పం ధ్వజావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం నందివనపర్తి ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులతో పల్లకిసేవా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారతిస్వామిజీ మాట్లాడుతూ.. మనకి ఎన్ని మంచిగుణాలున్నా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి ఉండాలన్నారు. ఈ రెండులేకపోతే ముందుకు వెళ్లలేమన్నారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరగటానికి ఈ సందర్భంగా ఆయన పలు మెళకువలను తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు సదావెంకట్‌రెడ్డి, సమన్వయ మండలి సభ్యులు గణేశ్, రాఘవేంద్రశర్మ, వెంకట్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శివకుమార్, నిఖిల్‌కుమార్, సంతోశ్‌కుమార్, రుద్రమ్మ, దీపిక, అనురాధ, జలేందర్ ఉన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

కడ్తాల్, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని మక్తమాదారం గ్రామంలో కొలువైన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశీక అర్చకులు రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఏసీపీగా రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 : ఇబ్రహీంపట్నం ఏసీపీగా కేపీవీ రాజును ప్రభుత్వం నియమించింది. గతంలో ఉన్న ఏసీపీ శ్రీనివాస్‌ను శంషాబాద్ ఏసీపీగా బదిలీ చేయగా, కేపీవీ రాజును ఇబ్రహీంపట్నం ఏసీపీగా బదిలీ చేశారు. ఆయన గురువారం బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

కడ్తాల్, ఫిబ్రవరి 14: అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు మంజూరు చేసిన రూ.5 లక్షలతో చేపట్టిన వడ్డెర సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను బుధవారం సంఘం నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని కులాలకు కమ్యూనిటీ భవనాలు, కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాస్, యాదయ్య, వెంకటేశ్, నర్సింహ, నాగార్జున్, సత్యం, రవి, మహేశ్, సురేశ్, సందీప్, మల్లేశ్, నాయకులు రాజేశ్, మహేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా విగ్రహ పల్లకీసేవ

నందిగామ, ఫిబ్రవరి 14 : నందిగామలోని షిర్డీ సాయిబాబా దేవాలయ ప్రథమ వార్షికోత్సవం, చేగూరులోని సాయిబాబా దేవాలయ 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సాయిబాబా విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించి పూజలు చేశారు. అనంతరం దేవాలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ప్రియాంకగౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, ఎంపీటీసీ చంద్రపాల్‌రెడ్డి, నందిగామ సాయిబాబా దేవాలయ నిర్మాణ దాతలు తాండ్ర రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కడ్తాల్, ఫిబ్రవరి 14: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీశైలం అన్నారు. బుధవారం తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంజూరు చేసిన ఎస్డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రాంపూర్ గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశ్, నాయకులు జగ్గారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, శంకరయ్య, జంగయ్య, జగదీశ్, కృష్ణయ్య, మల్లేశ్, శంకర్, పాండు, నవీన్, రమేశ్, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

పుట్టిన రోజే మృత్యువు ఒడిలోకి..

షాద్‌నగర్, ఫిబ్రవరి14: తన పుట్టిన రోజునే ఓ విద్యార్థి మృత్యువు ఒడిలోకి జారుకున్న విషాద ఘటన షాద్‌నగర్ పట్టణంలో బుధవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంద్దుపల్లె గ్రామానికి చెందిన మేకల శేఖర్ దంపతుల కుమారుడు మేకల దివ్యకాంత్(12) షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లిలోని వివేకానంద కళాశాల భవనంలో నిర్వహిస్తున్న దౌల్తాబాద్ మండల బీసీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి వసతి గృహంలో పడుకున్నాడు. తెల్లవారుజామున మరుగుదొడ్డికి వెళ్లి అక్కడే అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు వసతి గృహం సిబ్బందికి తెలుపడంతో దివ్యకాంత్‌ను హుటాహుటిన షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. దివ్యకాంత్ ఆరోగ్యాన్ని పరిశీలించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. రక్తంతో కూడిన విరేచనాలు కావడంతో ఆరోగ్యం క్షీణించి మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇదిఇలా ఉంటే దివ్యకాంత్‌కు ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేవని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. తన కొడుకు పుట్టిన రోజునే మృతిచెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

షాద్‌నగర్ పట్టణంలో మృతిచెందిన గురుకుల పాఠశాల విద్యార్థి దివ్యకాంత్ తల్లిదండ్రులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. సర్కారు దవాఖానలోని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. మృతికి గల కారణాలను తెలుసుకొని తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో పర్యవేక్షణ ఉండే విధంగా ప్రత్యేక శ్రద్ధచూపుతామని చెప్పారు. గురుకుల పాఠశాల సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

ముగ్గురు కమిషనర్లు బదిలీ

బడంగ్‌పేట, ఫిబ్రవరి 14: మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి కమిషనర్లను బదిలీ చేశారు. బడంగ్‌పేట కమిషనర్‌గా పనిచేసిన సుమన్ రావును శంషాబాద్‌కు, మీర్‌పేటలో పనిచేసిన కమిషనర్ వాణిరెడ్డిని తుర్క యంజాల్‌కు, జల్‌పల్లిలో పనిచేసిన కమిషనర్ వసంతను ఆమనగల్‌కు బదిలీ చేశారు. బడంగ్‌పేట కమిషనర్‌గా జి.రఘు బ్యాధతలు తీసుకోనున్నారు. జల్‌పల్లి కమిషనర్‌గా ముసాబ్ హీద్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకోనున్నారు.

కరాటే పోటీల్లో ఎల్బీనగర్ విద్యార్థుల జయభేరి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 14: ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 9వ ఇన్విటేషనల్ జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌లో ఎల్బీనగర్‌కు చెందిన విద్యార్థులు గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించారు. మాస్టర్ రవి ఆధ్వర్యంలో శిక్షణ పొంది బాలుర విభాగంలో సాయి నర్సింహ, బాలికల విభాగంలో చల్లా నవ్య, గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించింది. విద్యార్థులకు కప్పులు, సర్టిఫికెట్లు అందజేశారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

సైదాబాద్, ఫిబ్రవరి 14: సింగరేణి గుడిసె వాసులకు ఇండ్ల పట్టాల సాధనకై శనివారం సైదాబాద్ మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర నాయకులు ఆర్.శంకర్‌నాయక్ తెలిపారు. బుధవారం సింగరేణి కాలనీలో పి.చందులాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన గుడిసె వాసుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 40 ఏండ్లుగా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పేదలు ప్రభుత్వ మిగులు భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, అప్పటి నుంచి ఇండ్ల పట్టాలు ఇవ్వలేదని, అలాగే కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. బోగస్ సొసైటీ పేరుతో కొంతమంది అధికారులను, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారని, పేద ప్రజలకు న్యాయం జరిగేంతవరకు ఉద్యమిస్తామన్నారు. సింగరేణికాలనీ గుడిసెల్లో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాల సాధనకై శనివారం సైదాబాద్ మండల కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, గుడిసెవాసులందరూ తమ ఇండ్ల పట్టాల సాధనకై పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిసెవాసుల నాయకులు చందులాల్ నాయక్, షేక్ మహమూద్, కేశవనాయక్, సద్దాం ఖాన్, విక్రమ్, వంశీ, దశరథ్ నాయక్, విజయ్, నేతాజీ పాల్గొన్నారు.

అధికారుల బదిలీలు.. బాధ్యతల స్వీకరణ

నందిగామ ఎంపీడీవో సుమతిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

జిల్లాలో వివిధ మున్సిపాలిటీ, మండలాల్లో పని చేస్తున్న ఎంపీడీవోలు, కమిషనర్లు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో నూతనంగా బుధవారం పలువురు బాధ్యతలను స్వీకరించారు.

యాచారం ఎంపీడీవోగా నరేందర్

యాచారం : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నరేందర్ బాధ్యతలను చేపట్టారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన విజయలక్ష్మి వికరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో యాదాద్రి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన నరేందర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా తమ విధులను నిర్వహించనున్నారు. ఆయనకు ఎంపీపీ సుకన్య, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

తుర్కయంజాల్ కమిషనర్‌గా వాణి

తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. కమిషనర్‌గా ఇక్కడ విధులు నిర్వహించిన సీహెచ్ శ్రీకాంత్‌ను పెద్దపల్లి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

కొత్తూరు : కొత్తూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎన్ బాలాజీ బదిలీపై వచ్చారు. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న వీరేందర్ చిట్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నకిరేకల్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్ బాలాజీ కొత్తూరుకు నూతనంగా వచ్చారు. అదేవిధంగా తహసీల్దార్‌గా రవీందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా ఉన్న జానకీ హయత్‌నగర్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న శరత్‌చంద్రబాబు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నూతన ఎంపీడీవోగా అరుంధతి బాధ్యతలు స్వీకరించారు.

కడ్తాల్ ఎంపీడీవోగా సుజాత

కడ్తాల్ : కడ్తాల్ మండల నూతన ఎంపీడీవోగా సుజాత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన రామకృష్ణ బదిలీపై వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి వెళ్లగా.. ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో ఎంపీడీవోగా పని చేస్తున్న సుజాత కడ్తాల్ మండలానికి వచ్చారు. ఈ మేరకు ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు.

నందిగామ ఎంపీడీవోగా సుమతి

నందిగామ : నందిగామ ఎంపీడీవో బాల్‌రెడ్డి జడ్చర్లకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పి.సుమతిని ఎంపీడీవోగా నియమించారు. ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా వసంత

ఆమనగల్లు : మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యామ్‌సుందర్ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వసంత మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

మంచాల ఎంపీడీవోగా బాలశంకర్

మంచాల : మంచాల ఎంపీడీవోగా ఎ.బాలశంకర్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. యాదాద్రి జిల్లా పోచంపల్లి నుంచి ఆయన బదిలీపై మంచాలకు వచ్చాడు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ యాదాద్రి జిల్లా భువనగిరికి బదిలీపై వెళ్లాడు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలశంకర్‌ను సిబ్బంది సన్మానించారు.

జవాన్ల అమరత్వం మరువలేనిది

శంకర్‌పల్లి : నివాళులర్పిస్తున్న విద్యార్థులు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి14: దేశ భద్రతలో జవాన్‌ల పాత్ర ఎంతో కీలకమని లిటిల్ స్టార్ పాఠశాల కరస్పాండెంట్ సంజీత్‌కుమార్ అన్నారు. బుధవారం పాఠశాలలో 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రవాద దాడిలో వీర మరణం పొందిన 40 మంది జవాన్‌లకు విద్యార్థులతో కలిసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఆనంద్, శిరిష తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు ఘన నివాళి

ఆమనగల్లు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆమనగల్లు ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పుల్వామా అమరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ బాలరామ్, లయన్స్ క్లబ్ ఉప అధ్యక్షుడు పాపిశెట్టి రాములు ముఖ్య అతిథిలుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. 2019 ఫిబ్రవరి 14న దేశ రక్షణలో భాగంగా విధులు నిర్వహించేందుకు వాహనాల్లో కశ్మీర్‌కు వెళ్తున్న సీఆర్పీ జవాను ఉగ్రవాద సంస్థ దాడిలో అమరులు అయ్యారని ఎస్ఐ బాలరామ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ యాదయ్య, కళాశాల ఉపాధ్యాయులు వెంకటేశ్, నాయకులు శివ, మల్లేశ్, అంజి, శంకర్, సుమన్, ఆంజనేయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి : ఎంపీడీఓ

కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరిత

కందుకూరు, ఫిబ్రవరి 14 : పంచాయతీ కార్యదర్శులు విధులను సక్రమంగా నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరిత తెలిపారు. మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పడిందని వారి సమక్షంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉంటుందని చెప్పారు. 35గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి వాణి

మొయినాబాద్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందరికీ అందేలా సమన్వయంతో పని చేద్దామని మండల వైద్యాధికారి వాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి నట్టల నివారణ మాత్రలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఎవరైనా మిగిలిపోతే 27వ తేదీన వారికి కూడా నట్టల నివారణ మాత్రలు వేయాలని చెప్పారు. మార్చి 3 నుంచి 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో సంధ్య, హెల్త్ సూపర్‌వైజర్లు సునీత, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కిషన్

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 14: చేవెళ్ల ఏసీపీగా బంటు కిషన్ బాధ్యతలు చేపట్టారు. చేవెళ్ల ఏసీపీగా పనిచేసిన ప్రశాంత్‌రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. తెలంగాణ స్టేట్ లెవల్ కంట్రోల్ సెంటర్‌లో డీఎస్పీగా పనిచేసిన బంటు కిషన్ బుధవారం చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కిషన్‌ను చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్సై వీరబ్రహ్మం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి మొక్కలను అందజేశారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వెల్జాల్ గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజు

కడ్తాల్, ఫిబ్రవరి 14 : పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి రాజు అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన రైతులు పెంటయ్యగౌడ్, అంజయ్య, వెంకయ్య సాగు చేసిన వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరినారులో అగ్గి తెగులు సోకే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. తెగులు నివారణకు 0.5 గ్రాములు ట్రైసైక్లోజోల్ లేదా పన్ పాయింట్ 5 ఎంఎల్ ఐసోప్రో తయోలిన్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. పంటల సాగులో అధికారులు సూచించిన మేరకే రసాయన మందులు, ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శిరీష, రైతులు పాల్గొన్నారు.

దళితులపై దాడి హేయనీయమైన చర్య

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 14 : చట్టాలు ఎన్ని ఉన్నా దళితులపై దాడులు ఆగడం లేదని చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో దళితులు, చర్చిలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల దాడులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్లు గడిచినా దళితులపై వేధింపులు, దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.